మలుపులు.. ప్రమాద పిలుపులు

- ప్రమాదభరితంగా రోడ్ల మలుపులు
- కనిపించని సూచిక బోర్డులు
- ప్రమాదాలపాలవుతున్న వాహనచోదకులు



సంగం-కలిగిరి రోడ్డులోని మలుపు వద్ద కనిపించని సూచక బోర్డు

సంగం: మండలంలోని గ్రామీణ, రాష్ట్ర రహదారులతో పాటు నెల్లూరు-ముంబయి జాతీయ రహదారిపైన మలుపులు ప్రమాదాలకు నెలవుగా మారాయి. మలుపుల వద్ద సూచిక బోర్డులు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ఘటనల్లో పలువురు మృత్యువాత పడగా, కుటుంబ పెద్ద దిక్కున కోల్పోయి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. తీవ్ర గాయాలతో ఆస్పత్రులపాలై అప్పుల పాలవుతున్నారు. మండలంలో నెల్లూరు-ముంబయి జాతీయ రహదారి 23 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. కోలగట్ల నుంచి ప్రారంభమై అన్నారెడ్డిపాళెం వద్ద ముగుస్తుంది. ఈ మధ్యలో సంగం కొండప్రాంతంతో పాటు వెంగారెడ్డిపాళెం, గాంధీజనసంఘం, ర్యాంపు, దువ్వూరు, తదితర ప్రాంతాల్లో భారీ మలుపులు ఉన్నాయి. అలాగే సంగం-కలిగిరి రహదారిలోనూ సంగం చెరువుదాటిన తరువాత భారీ మలుపు ఉంది. ఆయా ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు పెరగడం వల్ల ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. మరోవైపు ఆయా ప్రాంతాల్లో మలుపులు సూచించే హెచ్చరికబోర్డులు లేవు. బోర్డులు ఉన్నా రాత్రి వేళల్లో సరిగా కనిపించడం లేదు. దీంతో వేగంగా వచ్చే వాహనాలు మలుపులు తిరిగే సమయంలో ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించబోయి ప్రమాదాలబారిన పడి మృత్యువు కబళించడం లేదా తీవ్రగాయాలపాలవుతున్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల నుంచి హైవే పైకి వచ్చే క్రమంలోనూ ఆర్అండ్‌బీ, హైవే అధికారులు స్పందించి మలుపుల వద్ద చెట్ల కొమ్మలను తొలగించి ప్రమాద హెచ్చరిక బోర్డులు, సూచికబోర్డులను ఏర్పాటు చేయాలని వాహనచోదకులు కోరుతున్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి



మండలంలో రోడ్ల మలుపులు ప్రమాద భరితంగా ఉన్నాయి. మలుపుల వద్ద సూచికబోర్డులు లేని కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆర్అండ్‌బీ, హైవే అధికారులు స్పందించి సూచిక బోర్డులను ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి.

– తోకల మురళి, సంగం

ఇటీవల జరిగిన ప్రమాదాలు

- జనవరి 1వ తేదీ దువ్వూరు సమీపంలో నెల్లూరు-ముంబయి జాతీయ రహదారిపై సత్యంజీ లేఅవుట్ సమీపంలోని మలుపు వద్ద టమోట లోడుతో వెళ్తున్న బొలెరోను లారీ ఢీకొన్న ప్రమాదంలో బొలెరోలోని బెస్త దస్తగిరి, వెంకట రమణారెడ్డి మృత్యువాత పడ్డారు.
- జనవరి 4వ తేదీ వెంగారెడ్డిపాళెం క్రాస్‌రోడ్డు సమీపంలో ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో నెల్లూరు వెంకటశేషయ్య, నెల్లూరు వెంకట వరలక్ష్మి అనే దంపతులు మృత్యువుపాలయ్యారు.
- జనవరి 27న సంగం-కలిగిరి రహదారిలోని సంగం చెరువు దాటిన తరువాత ఉన్న భారీ మలుపులో మోటార్‌సైకిల్ అదుపుతప్పి తురిమెర్ల శ్రీనివాసులు అనే వ్యక్తి మృతి చెందాడు.
- ఫిబ్రవరి 20వ తేదీ సంగం కొండపై నెల్లూరు-ముంబయి జాతీయ రహదారి మలుపులో బైక్ అదుపు తప్పడంతో షేక్ మస్తాన్ అనే వ్యక్తి తీవ్రగాయాలపాలై చికిత్స పొందుతూ మృతి చెందాడు.
- ఏప్రిల్ 17వ తేదీ సంగం-కలిగిరి రోడ్డులోని మలుపు వద్ద కారు అదుపు తప్పి లోతుగా ఉన్న రోడ్డు మార్జిన్‌లో బోల్తాపడి దగ్ధమైంది. ఈ ఘటనలో ప్రయాణికులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. అలాగే సంగం చెక్‌పోస్టు సెంటర్‌లో రోడ్డు క్రాస్ చేస్తున్న బస్సును సిమెంట్ ట్యాంకర్ ఢీకొన్న ఘటనలో బస్సులోని పలువురు ప్రయాణికులు గాయాలపాలయ్యారు.



సంగం-కలిగిరి రహదారిలోని భారీ మలుపు వద్ద ప్రమాదకరంగా మార్జిన్



సంగం కొండవద్ద జాతీయ రహదారిపై ఉన్న భారీ మలుపు



సంగం-కలిగిరి రహదారిలోని భారీ మలుపులో అదుపుతప్పి మార్జిన్‌లోకి దూసుకెళ్లి దగ్ధమైన కారు (ఫైల్)

క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



ఆత్మకూరు: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని జెడ్పీ మాజీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని నివాసంలో జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా, ఆత్మకూరు రాజకీయ పరిస్థితులపై జగన్‌మోహన్‌రెడ్డి ఆరాతీశారని రాఘవేంద్రరెడ్డి తెలిపారు.

నేడు సీతారాముల కల్యాణోత్సవం

ఉదయగిరి రూరల్: మండలంలోని జీ అయ్యవారిపల్లెలో జరుగుతున్న సీతారాముల ఉత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం తెలిపారు. రాత్రికి గ్రామోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కల్యాణోత్సవాన్ని తిలకించాలని కోరారు.

విద్యుత్‌శాఖ ఏఈగా సురేష్‌బాబు



సోమశిల: అనంతసాగరం మండల విద్యుత్ శాఖ ఏఈగా ఎం సురేష్‌బాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నంద్యాల జిల్లా పాణ్యం సెక్షన్‌లో పనిచేస్తున్న ఆయన అనంతసాగరం మండలానికి బదిలీపై వచ్చారు. నూతన ఏఈను విద్యుత్ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. అసిస్టెంట్ ఇంజనీర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంకు సన్మానం



ఉదయగిరి: మండలంలోని దుర్గంపల్లి ఎంపీపీ స్కూల్‌లో హెచ్‌ఎం షేక్ జాఫర్‌అహ్మద్ ఉద్యోగ విరమణ సభను బుధవారం నిర్వహించారు. హెచ్‌ఎంను సహచర ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. హెచ్‌ఎంగా ఆయన అందించిన సేవలను కొనియాడారు. తన ఉద్యోగ కాలంలో ఒక్కరోజు కూడా సెలవు పెట్టని వ్యక్తి అని ప్రశంసించారు. ఆయన శేషజీవితం సుఖంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఉపాధ్యాయులు, రాజకీయ నేతలు పాల్గొన్నారు.

చిత్రకళ శిక్షణా తరగతులు ప్రారంభం

ఉదయగిరి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వేసవిని దృష్టిలో ఉంచుకుని సంస్కార భారతి ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న ఉచిత చిత్రకళ శిక్షణ తరగతులను ఎంపీడీఓ అప్పాజీ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయగిరి ఆర్టీసీ డిపో కండక్టర్, చిత్ర కళాకారుడు సుదర్శన్ విద్యార్థులకు ఉచితంగా చిత్రకళలో శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. విద్యార్థులు శిక్షణను సద్వినియోగం చేసుకుని చిత్రకళలో రాణించాలని కోరారు.

నేటి నుంచి క్రికెట్ టోర్నమెంట్

సీతారామపురం : మండలంలోని అయ్యవారిపల్లె పంచాయతీ పరిధిలోని గౌతమ్‌నగర్‌లో అంకమ్మ క్రికెట్ టోర్నమెంట్‌ను గురువారం నుంచి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం తెలిపారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.60,016, ద్వితీయ బహుమతిగా రూ.30,016, తృతీయ బహుమతిగా రూ.15,016 నగదును అందజేయనున్నట్లు చెప్పారు. టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన వారు 79939 05983, 98667 07356 నంబర్లను సంప్రదించాలని కోరారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ.280

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో బుధవారం కిలో పొగాకు గరిష్ట ధర రూ.280 పలికింది. వేలానికి జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 406 బేళ్లను తీసుకురాగా, 317 బేళ్లను కొనుగోలు చేశారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.210, సరాసరిన రూ. 246.93 ధర పలికిందని వేలం నిర్వహణాధికారి టీ ఇషాక్ స్వర్ణదత్ తెలిపారు.

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో బుధవారం 393 బేళ్లను కొనుగోలు చేసినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 619 బేళ్లు రాగా, 393 బేళ్లను కొనుగోలు చేసినట్లు చెప్పారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.210, సగటున రూ.253.22 ధర పలికిందని తెలిపారు.

సింహాచలం మృతులకు సంతాపం

కావలి: సింహాచలం అప్పన్న సన్నిధిలో గోడ కూలి 8 మంది ప్రాణాలు కోల్పోవడంపై మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తి చేశారు. వరాహలక్ష్మీనరసింహస్వామి చందనోత్సవానికి వచ్చి భక్తులు ప్రమాదానికి గురికావడం బాధాకరమని పేర్కొన్నారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడ్ని ప్రార్థిస్తున్నామని తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



ఉదయగిరి: కుట్టు శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ అప్పాజీ కోరారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని కుట్టు శిక్షణ కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. 134 మంది మహిళలకు 90రోజుల పాటు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. మహిళలు క్రమం తప్పకుండా హాజరై కుట్టు శిక్షణలో నైపుణ్యాన్ని సాధించాలన్నారు. నిర్వాహకులు నాజియాతాజున్, శిక్షకురాలు పద్మ, తదితరులు పాల్గొన్నారు.

వేసవి ప్రత్యేక నృత్య శిక్షణ తరగతులు

ఆత్మకూరు: పట్టణంలోని శ్రీభారతి నృత్య విద్యాలయంలో వేసవి ప్రత్యేక నృత్య శిక్షణ తరగతులను బుధవారం ప్రారంభించారు. ప్రముఖ నాట్యాచార్యులు మాస్టర్ విధుమౌళి నేతృత్వంలో శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు విద్యాలయ నిర్వాహకులు అపర్ణ, చక్రవర్తి దంపతుల తెలిపారు. పట్టణంలోని చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కిశోరి వికాసంపై శిక్షణ



కలిగిరిలో అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ పద్మజాకుమారి



అల్లూరులో అవగాహన కల్పిస్తున్న అధికారులు

కలిగిరి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కిశోరి వికాసంపై శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీఓ సీహెచ్ పద్మజా కుమారి పాల్గొని మాట్లాడారు. శుక్రవారం నుంచి జూన్ 10వ తేదీ వరకు కిశోరి వికాసం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లుగా తెలిపారు. అందులో భాగంగా గ్రామస్థాయిలో ప్రతి మంగళ, శుక్రవారాల్లో కిశోర బాలికలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి లింగవివక్షత, మీడియా ప్రభావం, సంపూర్ణ ఆహారం, ఆరోగ్యం, నాణ్యమైన విద్య, వ్యక్తిగత రుతుస్రావ సమస్యలు, పరిశుభ్రత, లైంగిక వేధింపుల నుంచి రక్షణ, బాల్యవివాహాలను అరికట్టడం, మానవ అక్రమ రవణా, ఆత్మరక్షణ, నైపుణ్యం, ఉపాధి, తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. ఎంపీడీఓ ప్రత్యూషారెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, హెల్త్‌సూపర్‌వైజర్ సంపూర్ణమ్మ, జూనియర్ అసిస్టెంట్ దీక్షితులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండల పరిషత్ కార్యాలయంలో కిశోరి వికాసంపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీఓ కే శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. కిశోర బాలికలు ఏది మంచో, ఏది చెడో సమర్థవంతంగా ఆలోచించే విధంగా మానసికంగా సంసిద్ధం చేయాలన్నారు. ఈ దశలో మనసు చెంచలంగా ఉంటుందని, వారు తీసుకునే నిర్ణయాల్లో నిక్కచ్చితత్వం లోపిస్తుందన్నారు. ఈ దశలో తల్లిదండ్రులు బాలికలకు సమాజంలో జరుగుతున్న మంచి చెడుల గురించి వివరించి భవిష్యత్తులో మంచి నడవడికతో ముందుకు సాగేలా అవగాహన కల్పించాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షకీల, అంగన్‌వాడీ,,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అల్లూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కిశోరి వికాసంపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి పాల్గొన్నారు. మే 2 నుంచి జూన్10వ తేదీ వరకు కిశోరి వికాసంలో భాగంగా నిర్వహించాల్సిన కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు, సమతుల ఆహారం, వ్యక్తిగత పరిశుభ్రత, బాలికల అక్రమ రవాణా, పిల్లల రక్షణ, రక్తహీనత, లింగ వివక్ష, విద్యా ప్రాముఖ్యత, సైబర్ సేఫ్టీ, తదితర అంశాలపై కిశోరబాలికలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎంపీడీఓ రజనికాంత్, డాక్టర్ నవీన్‌కుమార్, ఏఎస్సై వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

అధికారులు ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన

కొండాపురం: ఎన్నో ఏళ్లుగా తాము ఉంటున్న స్థలాన్ని ఖాళీ చేయాలని కొందరు నాయకుల మాటలు విని అధికారులు తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని తూర్పుఎరబెల్లి గ్రామానికి చెందిన ఎరగల మాల్యాద్రి, వెంగమ్మ దంపతులు బుధవారం విలేకరుల ఎదుట వాపోయారు. గ్రామంలోని సర్వేనంబర్ 508లోని స్థలంలో తాము పదేళ్లుగా పశువుశాలను నిర్మించుకుని పశువులను పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నామని తెలిపారు. అయితే గ్రామానికి చెందిన కొందరు నాయకుల మాటలు విని అధికారులు ఖాళీ చేయాలని తమను ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. అదే సర్వే నంబర్‌లోని స్థలాన్ని గ్రామానికి చెందిన మరో ఏడు కుటుంబాల వారు వినియోగించుకుంటున్నారని, వారిని పట్టించుకోకుండా కక్ష కట్టి తమను మాత్రమే ఇబ్బంది పెడుతున్నారని వాపోయారు. గ్రామంలో లేనివారు వచ్చి అడ్డం తిరిగారని అధికారులు వారికి వత్తాసు పలుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మండలాధికారులు గ్రామంలోకి వచ్చి విచారణ జరిపి ఎన్ని సంవత్సరాలుగా వారు గ్రామంలో ఉంటున్నారో తెలుసుకుని తమకు న్యాయం చేయాలని బాధితులు కోరారు.

దామిశెట్టికి నివాళులు



దామిశెట్టి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రామిరెడ్డి, మేరిగ, ఆనం

కావలి: పట్టణంలో బుధవారం జరిగిన వైఎస్సార్‌సీపీ నాయకుడు దామిశెట్టి శ్రీనివాసులునాయుడు ఉత్తరక్రియల్లో ఎమ్మెల్సీ మేరిగ మురళి, కావలి, సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యేలు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, నెల్లూరు రూరల్ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డి పాల్గొన్నారు. దామిశెట్టి శ్రీనివాసులునాయుడు చిత్రపటానికి నివాళులర్పించారు. కుమారులు సుధీర్‌నాయుడు, బాలసురేష్ నాయుడును పరామర్శించారు. అలాగే రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, తదితరులు దామిశెట్టికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాగా కావలి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మరణించిన సూరిశెట్టి రమేష్ కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి పరామర్శించారు.

శ్రమైక జీవన సౌందర్యం

పట్టెడన్నం కోసం చెమటను చిందిస్తారు. తాము చేసే పనిలోనే ఆనందాన్ని వెతుక్కుంటారు. రేయింబవళ్లు శ్రమిస్తూ లోకాన్ని నడిపిస్తారు. శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది లేనేలేదని నిరూపించే కష్టజీవులకు మేడే సందర్భంగా సెల్యూట్.

–ఆత్మకూరు



ఆత్మకూరులో ఓ కొయ్యమిల్లులో ఆనందంగా మొద్దును మోస్తున్న కార్మికులు

విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంచాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న కుమార రాజా

వింజమూరు(ఉదయగిరి): విద్యార్థులపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధచూపి చదవడం, రాయడంపై ఆసక్తిని పెంపొందించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార రాజా సూచించారు. వింజమూరు గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిబిరాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. విద్యార్థులకు పుస్తక పఠనంతో కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 63 గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రంథాలయాధికారి జ్యోతి కొండయ్య, యుడీసీ కుమార్ పాల్గొన్నారు.

14 నుంచి వాసవీ కన్యకాపరమేశ్వరి మహాకుంభాభిషేక మహోత్సవాలు

కావలి: పట్టణంలో నూతనంగా నిర్మించిన ఆర్యవైశ్యుల కులదైవం వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో ఈ నెల 14 నుంచి మహాకుంభాభిషేక మహోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆ ఆలయ కమిటీ శాశ్వత గౌరవాధ్యక్షుడు కందుకూరి వెంకటసత్యనారాయణ తెలిపారు. బుధవారం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సుమారు 9 సంత్సరాల నుంచి ఆలయ పునర్నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ నెల 13న 1050 మంది ఆర్యవైశ్య మహిళలతో సత్యనారాయణస్వామి ఆలయం నుంచి కన్యకా పరమేశ్వరి దేవస్థానం వరకు కలశాలతో ఊరేగింపు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 14 నుంచి 18వ తేదీ వరకు మహాకుంభాభిషేక మహోత్సవ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వివరించారు.

పరామర్శ

బిట్రగుంట: బోగోలు మండంలో ఇటీవల వేర్వేరు కారణాలతో మృతి చెందిన వారి కుటుంబాలను కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. బోగోలు పంచాయతీ బేతనీయపేటకు చెందిన షేక్ మన్సూర్, విశ్వనాథరావుపేటకు చెందిన బత్తుల ప్రవీణ్ కుమార్ కొడవలూరు మండలం నార్తురాజుపాళెం సమీపంలో సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా వారి కుటుంబాలను పరామర్శించారు. అలాగే ఇటీవల బేతనీయపేటలో అనారోగ్యంతో మృతి చెందిన గంగపట్ల వెంకయ్య, గంగపట్ల సోమయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. తాళ్లూరులో ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్న రైతు ఏసుపోగు మొలకయ్య కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబానికి అండగా నిలబడుతామని హామీ ఇచ్చారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

8 నుంచి పాండురంగడి బ్రహ్మోత్సవాలు

సీతారామపురం : మండలంలోని పండ్రంగి సమీపంలో పాండురంగ విఠలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను ఈ నెల 8 నుంచి 12వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. 8న కలశస్థాపన, అభిషేకాలు, ధ్వజారోహణం, 9న హనుమంతసేవ, 10న గరుడసేవ, 11న కల్యాణం, 12న రథోత్సవం, పారువేట కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వివరించారు.

ఎమ్మెల్యేను కలిసిన మెట్టుకూరు

కావలి: జిల్లా కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ చైర్మన్‌గా నియమితులైన మెట్టుకూరు ధనుంజయరెడ్డి కావలి ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకటకృష్ణారెడ్డిని పట్టణంలోని ఆయన నివాసంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ధనుంజయరెడ్డిని ఎమ్మెల్యే సత్కరించారు.